జొన్నల డబ్బులేవీ..?

రైతన్నల ఎదురు చూపు
- 13 వేల క్వింటాళ్లు కొనుగోలు
- రూ.4 కోట్లు బకాయిలు
- ఖాతాల్లో పడని పైసలు
- పెట్టుబడికి తప్పని తిప్పలు



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)

రేగోడ్(మెదక్): వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసిన రైతన్నకు ఇబ్బందులు తప్పడం లేదు. పంట పండించినా అమ్ముదామంటే అడవి.. కొందామంటే కొరివి అన్న చందంగా ఉంది. జొన్నలు విక్రయించినా ఇంకా డబ్బులు రాలేదని, పెట్టుబడులకు అవస్థలు తప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 3,580 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. పంట పండించిన తర్వాత రైతులు ఇబ్బందులు పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం రేగోడ్, టి.లింగంపల్లి, గజ్వాడ గ్రామాల్లో మే 6న జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో 712 రైతులు 13వేల 11 క్వింటాళ్ల జొన్నలు విక్రయించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న జొన్నలను తరలించారు. కొనుగోలు చేసిన జొన్నలకు రూ.4.40 కోట్లు రైతులకు రావాల్సి ఉందని తెలిపారు. రోజులు గడుస్తున్నా తమ ఖాతాల్లో జొన్నల పైసలు పడటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవడంతో దుక్కులు దున్ని పంటలు సాగు చేయడం ప్రారంభం అయిందని, ఈ క్రమంలో పెట్టుబడుల కోసం నానా తంటాలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జొన్నల పైసల కోసం ఎదురు చూస్తున్నా.. డబ్బులు వేయడం లేదని చెప్పారు. జొన్నల డబ్బులు ఇవ్వకపోవడంతో తమ అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి జొన్నల డబ్బులు త్వరగా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పక్షం రోజులైంది



కొనుగోలు కేంద్రంలో జొన్నలు ఇచ్చి పదిహేను రోజులు అయింది. ఇప్పటి వరకు జొన్నల పైసలు బ్యాంకు ఖాతాలో వేయలేదు. పంటల సాగుకు పెట్టుబడుల కోసం నానా తంటాలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి త్వరగా డబ్బులు ఇవ్వాలి.

– నాగయ్య, రైతు రేగోడ్

ఉన్నతాధికారుల దృష్టికి



రేగోడ్ మండలంలోని మూడు గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. 13వేల 11 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసి.. ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. రైతులకు త్వరగా డబ్బులు ఇవ్వాలని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా.

– రాజుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్

క్లుప్తంగా

వాలీబాల్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడికి సన్మానం



హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్యదర్శులు

శివ్వంపేట(నర్సాపూర్): వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా నియమితులైన హన్మంత్‌రెడ్డిని సోమవారం పలువురు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శులు రవీందర్, కృష్ణ కలిసి సన్మాంచి, జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రంలో వాలీబాల్ క్రీడాకారులకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరినట్లు వారు చెప్పారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్‌లో విద్యార్థులకు ఉపాధ్యాయుడు దశరథం సోమవారం సొంత డబ్బులతో నోట్ బుక్స్, పెన్సిల్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు గణేష్, సైదులు కార్యదర్శి భాగ్యలక్ష్మి, నర్సిములు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతి

పాపన్నపేట(మెదక్): ప్రతి హిందువు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. సోమవారం నాగ్సాన్‌పల్లి శివారులోని ఉమాకేదారీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి నిత్యం భగవంతుని పూజ చేయడం వల్ల ముక్తికి మార్గం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాజశేఖర్ శర్మ, శ్యాం సుందర్ శర్మ, ఇంద్రసేనారెడ్డి, రవీందర్ ,వీరేశం పాల్గొన్నారు.

టీపీఓ బెదిరిస్తున్నాడు



మహబూబ్‌ఖాన్

మెదక్ కలెక్టరేట్: రోడ్డు ఆక్రమించి ఇల్లు కడుతున్నాడని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవాల్సిన టీపీఓ చంపుతానని బెదిరిస్తున్నాడని మెదక్‌కు చెందిన మహబూబ్‌ఖాన్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని అరబ్ గల్లీలో తన కూతురు పేరిట ఇంటి స్థలం కొన్నట్లు తెలిపారు. ఆ స్థలానికి ఎదురుగా నివాసం ఉండే వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఇల్లు కడుతున్నాడు. ఈ విషయమై మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ టీపీఓ భూపతి ఎట్లా ఫిర్యాదు చేస్తావ్...అంటూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని తుక్కాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీశైలం, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అంగన్‌వాడీలో అక్షరాభ్యాస కార్యక్రమం

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అమ్మ మాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, టీచర్‌సుమలత, ఆశ కార్యకర్త మానస పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి

కలెక్టర్‌ను వేడుకున్న బాధితురాలు



తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లికొడుకులు

మెదక్ కలెక్టరేట్: గుంట భూమి లేదు..ఉండేందుకు గూడు లేదని, ..ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోండి సారూ అంటూ బాధితురాలు కలెక్టర్‌ను వేడుకుంది. హవేళిఘణాపూర్ మండలం నాగాపూర్‌కు చెందిన శంకూరి సత్తమ్మకు భర్త చనిపోయాడు. ఒక కొడుకు ఉండగా మూగవాడు. వారు నివాసం ఉండే పూరి గుడిసే కూలిపోవడంతో ఆ పక్కనే టాపర్‌ను మూడేళ్లుగా గుడిసేగా చేసుకొని తల్లి కొడుకులు జీవిస్తున్నారు. ఇటీవల ఇందిరమ్మ పథకానికి దరఖాస్తు చేసుకుంది. అయినప్పటికీ మంజూరు కాలేదు. నాకు న్యాయం చేయాలని కార్యదర్శిని కోరితే పట్టించుకోవడం లేదని వాపోయారు. తనకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇప్పించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కలిసి వేడుకుంది.

పేదరిక నిర్మూలనకు మోదీ కృషి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు చంద్రం

తొగుట(దుబ్బాక): దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో దేశాన్ని 4వ అగ్రరాజ్యంగా నిలిపిన ఘనత నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. మండలంలో 789 మంది రైతుల నుంచి 8387 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. రూ 3.28 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉందన్నారు. వర్షాకాలం పంట సాగుచేస్తున్న క్రమంలో ప్రభుత్వం రైతులకు డబ్బులు ఖాతాల్లో జమచేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల డబ్బులు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిక్కుడు లింగం, స్వామిరెడ్డి, రాజు, కర్నాకర్, గణేష్, మహేష్, ఏసురత్నం, నిర్సంలు, రమేష్ పాల్గొన్నారు.

నూతన స్కూల్ భవనం నిర్మించాలి



విద్యార్థులతో రవి, తదితరులు

యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రవి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీలోని నూతన పాఠశాల భవనం నిర్మించాలని, యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గుడికందుల రవి అన్నారు. సోమవారం యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు కేసీఆర్‌నగర్ డబూల్ బెడ్‌రూం కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇరుకుగదుల్లో, మరుగుదొడ్ల పక్కనే విద్యార్థులు కూర్చోని పాఠాలు వినడం జరుగుందన్నారు. అందువలన ప్రభుత్వం వెంటనే నూతన పాఠశాల భవనం నిర్మించాలన్నారు.

వైభవంగా వెంకటేశ్వరుడి కల్యాణం

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్‌లో ప్రతి నెల నిర్వహించే వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి దంపతులచే ఆలయ పూజారి సుధీర్ శర్మ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్లను వెంటనే కట్టుకోవాలి

అల్లాదుర్గం(మెదక్): ఇందిరమ్మ ఇళ్లను వెంటనే కట్టుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ కౌసిక్ చెప్పారు. మండల పరిధిలోని ముస్లాపూర్‌లో ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లు కట్టుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విడతల వారీగా బిల్లులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేషారెడ్డి, నర్సింహారెడ్డి, సుభాష్‌రావ్, బాలకిషన్, నర్సింలు, రాజు, బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు పరిశ్రమలకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డుపై పరిశ్రమలో వ్యర్థాలను తగులబెడుతున్నారనే కథనానికి అధికారులు స్పందించి పలు పరిశ్రమలకు సోమవారం నోటీసులు అందజేశారు. మండలంలోని కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని అగర్వాల్ ప్లాస్టిక్ (సూకీ) పరిశ్రమ రోడ్డుపై వ్యర్థాలను తగులబెట్టడం, లార్విన్ పరిశ్రమ రోడ్డుపై వ్యర్థాలను పారబోస్తుండటంతో పంచాయతీ కార్యదర్శి సతీష్ నోటీసులు అందజేశారు.

విద్యుత్ వైర్లను సరిచేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు సోమవారం అన్నారు. వ్యవసాయ పొలాల వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున వాటిని సరి చేయాల్సిన బాధ్యత విద్యుత్ సిబ్బందిపై ఉందన్నారు. రత్నపూర్ గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాల్లో చాలా సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ లైన్ వల్ల రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఆర్థికపరమైన విధులకు దూరం

పంచాయతీ కార్యదర్శుల స్పష్టీకరణ



ఇన్‌చార్జి ఎంపీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆర్థికపరమైన విధులు నిర్వహించబోమని చిలప్‌చెడ్ మండల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ కార్యాయలంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 నెలలుగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్ర, రాష్ట్ర నిధులు ఆగిపోవడంతో గ్రామ పంచాయతీల రోజువారి నిర్వహణ ఖర్చులు, కార్యదర్శులపై పెనుభారంగా మారాయన్నారు. పలు పంచాయతీలు నిర్వహణకు చేసిన అప్పులు తీర్చలేక మొఖం చాటేయాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. దీంతో మంగళవారం నుంచి నిధులు వచ్చే వరకు ఆర్థిక పరమైన విధులు నిర్వహించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు అశోక్, మోహన్, నాగరాజు. ఆనంద్, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పేదింటి సొంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి రూప్లా తండా పంచాయతీలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేయని అభివృద్ధి పనులు తమ ప్రభుత్వం చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజల దరి చేరుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనుల గురించి కార్యకర్తలు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా, లక్ష్మీకాంతారావు, కరుణాకర్‌రెడ్డి, కమలపూల్‌సింగ్, గణేష్, గౌరీశంకర్, తిరుపతి రాథోడ్, అరుణ్, మురళిగౌడ్, తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రాజిరెడ్డి

భూసమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి

ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు భూసమస్యలు ఉంటే భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని భుజిరంపేట, వెంకటాపూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూసమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని రైతులకు సూచించారు. భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తుందని ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా భుజిరంపేటలో 160, వెంకటాపూర్‌లో 42 మంది రైతులు భూసమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్‌ఐ శ్రీహరి, లక్ష్మన్, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రధాని కృషి

బీజేపీ రాష్ట్ర గీతా సెల్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్‌గౌడ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర గీతా సెల్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధి మేదినీపూర్ గ్రామంలో వికసిత్ భారత్ 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పనితీరులపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం, రేషన్ బియ్యం పంపిణీ, వ్యవసాయ పరికరాల పనిముట్లపై సబ్సిడీలు, ఎరువులపై సబ్సిడీలను కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒకేసారి 3 నెలల సన్నరకం రేషన్ బియ్యాన్ని అందజేస్తుందన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూసేలా కేంద్రం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: చెత్త రహిత పట్టణంగా తయారు చేసుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు. నీటిని నింపి క్లోరినేషన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. ప్రజలకు అవగాహన కోసం పలు చోట్ల వాల్ పెయింటింగ్ వేయించినట్లు తెలిపారు. తడి, పొడి, హానికర చెత్తను విభజించి మున్సిపల్ వాహనానికి అందించాలని కోరారు. టీ పేపరు కప్పులకు బదులు స్టీల్ కప్పులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రావు, సానిటరి ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన కోనాపురం రేణుకకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో చెక్కు అందజేశామని మాజీ కౌన్సిలర్ యాదగిరి తెలిపారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు ఇమామ్, రామచంద్రం, కిషన్, పోచయ్య పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

నా పేరు **N. అఖిల W/o తుకారాం,** నివాసం: గ్రా॥ పెద్దగొట్టిముక్ల, మం॥ శివంపేట, జి॥ మెదక్. నా నాన్న గారి పేరిట (N. జెంలా) మామిడిపల్లి తాండలో జి॥ సంగారెడ్డిలో ఒక గుంట భూమి గలదు. గతంలో మా నాన్నగారు N. మెగ్యా దగ్గర 2005లో కొన్నారు. రిజిస్ట్రేషన్ 2005లో అయింది. **దాక్యుమెంటు నం. 19347/2005** ప్రస్తుతం మా నాన్నగారు మరణించడం జరిగింది. అయితే ఆ దాక్యుమెంటులు నా దగ్గర ఉండేది. అది పెద్దగొట్టిముక్ల నుండి శివంపేటకి BUSలో పోతుంటే పోయింది. **సెల్: 9652262894**

సంక్షిప్త వార్తలు

◆ బధిరులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలి

పాపన్నపేట(మెదక్): కరీంనగర్ బధిరుల పాఠశాలలో ఇంటర్, డిగ్రీ అవకాశాలు కల్పించాలని కోరుతూ విద్యాశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్‌కు విజ్ఞప్తి చేసినట్లు పాఠశాల పోషకుల చైర్మన్ బాబాగౌడ్ తెలిపారు. సోమవారం ఆయన పాపన్నపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బధిరుల కోసం కరీంనగర్‌లో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఎంతో మంది గ్రామీణ బధిరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పాఠశాల చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కానీ ఇక్కడ పదో తరగతి వరకే ఉండటంతో,పై చదువులు కొనసాగించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ వెళ్లాలంటే గ్రామీణ విద్యార్థులకు ఇబ్బంది ఉంటుందని చెప్పారు. అందువల్ల కరీంనగర్ బధిరుల పాఠశాలలో ఇంటర్, డిగ్రీ స్థాయికి పెంచాలని, ,విద్యాశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల మెరుగైన విద్యా బోధన ఉంటుందని మండల విద్యాధికారి సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మండలంలోని ఎనగండ్ల ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఉచిత విద్య, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా సాంకేతిక విద్యాబోధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంబిక,అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ తొనగండ్లలో యోగావాక్

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల గ్రామంలో సోమవారం యోగా వాక్ నిర్వహించారు. ఆయుష్‌శాఖ యోగా శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో యోగా విషయమై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ కనీసం గంటపాటు యోగా చేస్తే ఆరోగ్యం బాగుంటుందని భరత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, మాజీ ఎంపీటీసీ నాగులు పాల్గొన్నారు.

◆ 19 నుంచి దరఖాస్తులు ఆహ్వానం

పాపన్నపేట(మెదక్): తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ పాఠశాలలోని నాల్గవ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 19 నుంచి పాపన్నపేట ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడలు నిర్వహిస్తామన్నారు. 8 నుంచి తొమ్మిదేళ్ల వయస్సుగల విద్యార్థులు అర్హులన్నారు. ఇతర వివరాలకు విద్యాధికారి ప్రతాప్ రెడ్డి 85002 00859 ఫిజికల్ డైరెక్టర్ రమేష్ 90107 35121 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

◆ చట్టాలపై అవగాహన

తొగుట(దుబ్బాక): అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్ సూచించారు. మండలంలోని వెంకట్రావు పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలపైన అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్, ఈవిటీజింగ్, గంజాయి మత్తు పదార్థాలు, డ్రగ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే ఎలాంటి వివరాలు చెప్పొద్దని కోరారు.

◆ క్రీడల్లో రాణించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఫుట్‌బాల్ కోచింగ్ శిక్షణను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసాన్ని అందిస్తుందన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలన్నారు.

◆ నిరుపేదలకు బీఆర్‌ఎస్ అండ

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద యువకుడు ఎర్రోళ్ల కృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కుమార్, ఎల్లయ్య, రాజయ్య, బాబు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.